క్లుప్తంగా

ఊడ్పుల్లో జాగ్రత్తలు అవసరం



రైతులకు సూచనలు చేస్తున్న ఏఓ సత్యప్రసాద్

రామచంద్రపురం రూరల్: వరి నాట్లు వేసే సమయంలో నారును తీసి ఊడ్పులు వేసేటప్పుడు నారు క్రొనలు తుంచి ఊడ్చటం ద్వారా కాండం తొలుచు పురుగు గుడ్లు పూర్తిగా నాశనం అవుతాయని మండల వ్యవసాయాధికారి ఎస్.సత్యప్రసాద్ సూచించారు. జగన్నాయకుల పాలెంలో నారు తీస్తున్న పొలాల్లోని రైతుల వద్దకు వెళ్లి వారికి ఊడ్పుల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఏఓ సత్యప్రసాద్ మాట్లాడుతూ మండలంలో 18,236 ఎకరాల్లో వరి సాగు జరుగుతుందన్నారు. దాదాపు అన్ని గ్రామాల్లో వరి నాట్లు వేశారన్నారు. కౌలు రైతులందరికీ సీసీఎల్ కార్డులు తప్పనిసరిగా అందుతాయని తెలిపారు.

స్టూడెంట్ కిట్లను సద్వినియోగం చేసుకోవాలి



రామచంద్రపురంలో విద్యార్థులకు కిట్లను పంపిణీ చేస్తున్న చైర్‌పర్సన్ శ్రీదేవి తదితరులు

రామచంద్రపురం: ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న స్టూడెంట్ కిట్లను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు స్కూల్ బ్యాగ్స్, షూస్, పుస్తకాలు తదితర విద్యా సామగ్రిని ఆమె పంపిణీ చేశారు. శ్రీదేవి మాట్లాడుతూ ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలను చేరుకోవాలన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ కోలమూరి శివాజీ, పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఉష, పట్టణ వైఎస్సార్ సీపీ కన్వీనర్ గాదంశెట్టి శ్రీధర్ పాల్గొన్నారు.

కె.గంగవరం: భట్లపాలిక, కూళ్ల, పాణింగపల్లి, అముజూరు గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు స్టూడెంట్ కిట్లను ఎంపీపీ పంపన నాగమణి, మంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రి వాసంశెట్టి సత్యం పంపిణీ చేశారు. ఎంఈఓ నాగరాజు, టీడీపీ మండల అధ్యక్షుడు మరివాడ చిన్నికృష్ణ, ఉప సర్పంచ్ ఈదర వాసు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతంగా ఆలోచించాలి



విద్యార్థులకు కిట్లు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

కపిలేశ్వరపురం: విద్యార్థులు ఆధునిక పరిస్థితుల నేపథ్యంలో ఉన్నతంగా ఆలోచన చేయాలని జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి అన్నారు. మండలంలోని అంగర, కపిలేశ్వరపురం జెడ్పీ ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులకు గురువారం స్టూడెంట్ కిట్లను అందజేశారు. సర్పంచ్‌లు శాకా శ్రీనివాస్, వాసా కోటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు శీలం భాస్కరరావు, గొల్లపల్లి సోనియా, ఉప సర్పంచ్‌లు బొక్కా రాంబాబు, యర్రా వీరన్నబాబు మాట్లాడుతూ విద్యా ఉపకరణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు వంగా శ్రీనివాస్, అంగర రాజు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఆధార్ ప్రక్రియను వేగవంతం చేయాలి



ఆధార్ సెంటర్‌ను పరిశీలిస్తున్న బీజేపీ నాయకుడు

మండపేట: ప్రభుత్వ పథకాలకు ఆధార్ అవసరం ఉన్నందున పట్టణంలో చేపట్టిన ఆధార్ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోన సత్యనారాయణ కోరా రు. రావులపేట జనార్దన మున్సిపల్ పాఠశా ల అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహిస్తున్న ఆధార్ అప్ డేట్ ప్రక్రియను ఆయన గురువారం సందర్శించా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ ప్రతి ఒక్కరికీ ఆధార్ కార్డు తప్పులు లేకుండా ఉండాలన్నారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఉచిత ఆధార్ సేవలు ఏర్పాటు చేశారన్నారు. శుక్రవారం ధర్మగుండం చెరువు 8వ సచివాల యంలోను, వల్లూరి వీధిలో వున్న 9వ సచివాలయంలోను ఆధార్ సెంటర్లు ఏర్పాటు కానున్నాయి.

గట్టుక్కున మింగేసి..

- నదీ గర్భంలోకి ఇళ్లు
- అంతకంతకూ గట్టు కోత
- శాశ్వత రక్షణ చర్యల కోసం ఎదురుచూపులు



శేరిలంకలో గోదావరి కోతకు గురవుతున్న ఇళ్లు (ఫైల్)

కె.గంగవరం: వరద వణుకు పుట్టిస్తోంది.. గోదావరి పరివాహక ప్రాంతాలను కొంచెం కొంచెంగా కలిపేసుకుంటోంది.. ఏటా వరదలు వచ్చినప్పుడల్లా జొన్నాడ నుంచి యానాం వరకూ ఉన్న ఏటిగట్టు కోతకు గురవుతోంది. రామచంద్రపురం నియోజకవర్గం కె.గంగవరం మండలం కూళ్ల వద్ద నుంచి కాజులూరు మండలం కోలంక వరకూ సుమారు 30 కిలోమీటర్ల గోదావరి తీర ప్రాంతం ఉంది. దీంతో పాటు గోదావరి మధ్యలో కె.గంగవరం మండలానికి చెందిన శేరిలంక గ్రామం ఉంది. వరదలు వచ్చినప్పుడల్లా ఈ గ్రామంలో ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. శేరిలంక గ్రామం ఈ సమయంలో భారీ కోతకు గురవ్వడంతో కంటి మీద కునుకు ఉండడం లేదు. అనేక ఏళ్ల నుంచి ఇదే పరిస్థితి. ఇక్కడ సుమారు 400 కుటుంబాలు నివసిస్తున్నాయి. ఈ గ్రామం రోజు రోజుకూ గోదావరి ఉగ్రరూపానికి కుచించుకుపోతోంది. తాజాగా గట్టు వద్ద ఉన్న పక్కా ఇళ్లు కూడా కోతకు గురయ్యాయి. పరిస్థితి ఇలానే ఉంటే మరో పదేళ్లలో ఊరు గోదావరిలో కలసిపోతుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శేరిలంక గ్రామం కోతకు గురవ్వకుండా పదేళ్ల కిందట గట్టు వెంబడి రాళ్లతో రివెటింగ్ పనులు చేశారు. అవి కూడా రాను రానూ గోదావరిలో కలసిపోతున్నాయి. దీంతో పాటు సుందరపల్లి, కూళ్ల వద్ద ఏటిగట్టు భారీగా కోత బారిన పడుతోంది. ఏటా వరదల సమయంలో తీర ప్రాంత ప్రజల పరిస్థితి వర్ణనాతీతం. ఈ రెండు గ్రామాలతో పాటు కపిలేశ్వరపురం నుంచి బ్రహ్మపురి వరకూ ఏటిగట్టు మీద సుమారు 10 చోట్ల కోతకు గురవతుండటంతో సర్వత్రా ఆందోళన నెలకొంది. ఏటా వరదల సమయంలో అధికారులు తాత్కాలిక చర్యలు చేపట్టడమే తప్ప శాశ్వత పనులు చేయడం లేదని ప్రజలు వాపోతున్నారు.



సుందరపల్లి వద్ద గట్టుకు తాత్కాలిక రక్షణ పనులు

రహదారి.. మారాలి మరి

జొన్నాడ నుంచి యానాం వరకూ గత పుష్కరాలకు రహదారిని నిర్మించారు. అప్పట్లో హడావుడిగా ఈ పనులు చేశారు. రోడ్డుకు ఇరువైపులా బెర్మ్‌లు వేయలేదు. ఇలా రహదారి కోతకు గురవుతోంది. గోదావరి అందాలు చూసేందుకు వాహనాలపై వచ్చేవారు ఇక్కడ అదుపుతప్పి గాయాల పాలవుతున్నారు.

జొన్నాడ- యానాం ఏటిగట్టు రహదారిలో వందలాది మంది ప్రయాణిస్తున్నారు. పూర్తి స్థాయిలో బెర్మ్‌లు లేక ప్రమాదాల కొనితెచ్చుకుంటున్నారు. కె.గంగవరం మండలంలోని ఏటిగట్టు మరింత ప్రమాదకరంగా ఉంది. కోటిపల్లి- కోట, బ్రహ్మపురి- గోవలంక మధ్య ఉన్న ఏటిగట్టు కోతకు గురై బెర్మ్‌లు లేక నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డుకు ఇరువైపులా తుప్పలు పెరిగిపోవడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు.

శాశ్వత చర్యలు చేపట్టాలి

ఏటిగట్టు కోతకు గురికాకుండా శాశ్వత చర్యలు చేపట్టాలి. ఏటా వరదల కాలం వస్తుందంటే చాలు తీర ప్రాంత ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఏటిగట్టు చాలాచోట్ల బలహీనంగా ఉంది. అధికారులు తాత్కాలిక చర్యలు కాకుండా శాశ్వత పనులు చేపట్టాలి.

-చిల్లే నాగేశ్వరరావు, సర్పంచ్, కూళ్ల

ప్రతిపాదనలు పంపాం

ఏటిగట్టు పటిష్టం చేసేందుకు ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి పంపించాం. ఏటిగట్టు కూళ్ల, సుందరపల్లి వద్ద కోతకు గురవుతోంది. ఇప్పుడు వచ్చిన వరదలకు మరింత నదీ గర్భంలో కలసిపోతోంది. నిధులు మంజూరైన వెంటనే గట్టును పటిష్టం చేస్తాం.

-రెహమాన్, పీడబ్ల్యూడీ ఏఈ, కె.గంగవరం

పాఠశాల నిర్వహణ శాస్త్రీయంగా ఉండాలి



టేకి ప్రభుత్వ పాఠశాలలో ఎంఈఓ, జేఈలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ కొండలరావు

కపిలేశ్వరపురం: ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ శాస్త్రీయబద్ధంగా ఉండాలని ఎంపీడీఓ ఎం.కొండలరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. మండలంలోని టేకి ఎంపీపీ పాఠశాలను గురువారం ఎంపీడీఓ సందర్శించారు. పాఠశాలల అభివృద్ధి నేపథ్యంలో చేపట్టిన కార్యక్రమాలపై ఎంఈఓ కె.తాతారావు, పంచాయతీరాజ్ ఏఈ రాఘవులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో చర్చించారు.

వల్లూరులో దంత వైద్య శిబిరం



వల్లూరులో రోగిని పరీక్షిస్తున్న నిపుణులు

కపిలేశ్వరపురం: వల్లూరులో గురువారం కాకతీయ కమ్మ కిచెన్ సెంటర్ ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గ్రామంలోని పాతూరి మాధవరావు రైస్‌మిల్లు వద్ద నిర్వహించిన శిబిరంలో రాజానగరానికి చెందిన లెనోరా డెంటల్ హాస్పిటల్ నిపుణులు దంత పరీక్షలు చేశారు. ప్రొఫెసర్ గంధం అన్వేష్ నేతృత్వంలోని నిపుణులు దంత పరీక్షలు, నేత్ర ఆసుపత్రికి చెందిన ఆప్తమాలజిస్ట్ సతీష్ ఆధ్వర్యంలోని పరీక్షలను చేసి, మందులను అందించారు. మెరుగైన వైద్య పరీక్ష అవసరమైనవారికి ఆసుపత్రుల్లో ఉచితంగా సేవలందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఇంకా వీడని వరద



నారాయణలంక కాజ్‌వేను తాకిన వరదనీరు

కపిలేశ్వరపురం: గోదావరి నదిలో వరదనీరు నిలకడగా ప్రవహిస్తోంది. మండలంలోని కేదారిలంక, అద్దంకివారిలంక, పల్లపులంక, నారాయణలంక, వీధివారిలంక గ్రామాల శివారు ప్రాంతాల్లో వరద నీరు నేటికీ వీడలేదు. భద్రాచలం వద్ద నీటిమట్టం పెరుగుతున్న నేపథ్యంలో శుక్రవారం స్థానికంగా వరదనీరు పెరుగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలపై తహసీల్దార్ రాజరాజేశ్వరి, ఎంపీడీఓ కొండలరావు వరద ప్రాంతాలను పర్యవేక్షిస్తున్నారు. గ్రామాల కార్యదర్శి సీహెచ్ నరసింహారావు, ఇతర ప్రాంతాల్లోని వీఆర్వోలు, కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు గోదావరి రేవులు, లోతట్టు ప్రాంతాలు వద్ద విధులను నిర్వహిస్తున్నారు. కోరుమిల్లి సమీపంలోని గోదావరి గట్టు బలహీనంగా ఉన్న నేపథ్యంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు.

వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటన

కె.గంగవరం: మండలంలో వరద ప్రభావిత ప్రాంతాలైన కోటిపల్లి, మసకపల్లి, శేరిలంక గ్రామాల్లో గురువారం రామచంద్రపురం ఆర్డీఓ సుధాసాగర్ పర్యటించారు. కోటిపల్లి మత్స్యకార కాలనీలో ఇళ్ల చుట్టూ చేసిన వరదను పరిశీలించి రెవెన్యూ అధికారులకు పలు సూచనలు చేశారు. సుందరపల్లి వద్ద బలహీనంగా ఉన్న గట్టును పరిశీలించి, మరిన్ని ఇసుక బస్తాలు వేసి గట్టు పటిష్టం చేయాలని తెలిపారు. అనంతరం శేరిలంక గ్రామానికి వెళ్లి కోతకు గురవుతున్న గట్టును చూశారు. గ్రామంలో తాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వరద ఉధృతి తగ్గుముఖం పట్టిందని, అయితే భద్రాచలం వద్ద మళ్లీ పెరుగుతుండడంతో మరోసారి ఉధృతి పెరిగే అవకాశం ఉందన్నారు. ఏటిగట్టు పరివాహక ప్రాంత ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. తహసీల్దార్ రవీంద్ర, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.



కోటిపల్లి మత్స్యకార కాలనీలో పర్యటిస్తున్న ఆర్డీఓ సుధాసాగర్

రికార్డుల భద్రతకు ప్రాధాన్యం



సిబ్బందికి సూచనలిస్తున్న ఆర్డీవో సుధాసాగర్

రాయవరం: మండల తహసీల్దారు కార్యాలయాన్ని రామచంద్రపురం ఆర్డీవో సుధాసాగర్ గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. కార్యాలయాన్ని, రికార్డురూమ్‌ను పరిశీలించారు. రికార్డులు భద్రపర్చిన గదిని తనిఖీ చేసి, రికార్డు నిర్వహణ తీరును డిప్యూటీ తహసీల్దారు జానకిరామయ్యను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించి, తహసీల్దారు కార్యాలయంలో రికార్డుల నిర్వహణను సక్రమంగా, సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. అడంగల్ రికార్డులను పరిశీలించారు. రెవెన్యూ రికార్డులు, మండల సర్వే రికార్డుల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనివ్వాలన్నారు. కార్యాలయానికి వచ్చే పౌరులకు నూరు శాతం సంతృప్తిని కలిగించేలా సేవలు అందించాలని సూచించారు. కార్యాలయ ఆవరణను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. సమావేశంలో ఆర్ఐ పంపన రామారావు, కార్యాలయ సిబ్బంది చంద్రశేఖర్, సూర్యకుమారి, దేవేందర్, నందిని తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగాలు మరువలేనివి



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, నాయకులు

మండపేట: కార్గిల్ యుద్ధంలో అమరవీరుల త్యాగాలు మరువలేనివని బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు అయ్యాజీ వేమ అన్నారు. బీజేపీ యువ మోర్చా ఆధ్వర్యంలో గురువారం మండపేట పట్టణంలో కార్గిల్ యుద్ధంల మరణించిన వీర జవానులకు అంజలి ఘటిస్తూ చేపట్టిన ర్యాలీలో వారు పాల్గొన్నారు. అమరులైన జవాన్ల త్యాగాలను స్మరించుకుంటూ ఘనంగా పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయం నుంచి బస్‌స్టాండ్ వరకూ విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం మాజీ సైనికులు గుమ్మడి అనిల్‌కుమార్, గట్టి రామ్మోహన్‌లను సత్కరించారు. బీజేపీ నాయకులు మోకా వెంకట సుబ్బారావు, చాత్రాతి వెంకట రాంబాబు, గొడవర్తి రామచంద్రరావు, కంకటాల మరళీకృష్ణ పాల్గొన్నారు.

నోటీసులు ఇవ్వడం సరికాదు



సమావేశంలో మాట్లాడుతున్న రాజేంద్రప్రసాద్

సఖినేటిపల్లి: అంతర్వేది దేవస్థానం, దేవస్థానానికి అనుబంధంగా ఉన్న నీలకంఠేశ్వరస్వామి దేవస్థానం అధికారులు జారీ చేస్తున్న శిస్తుల నోటీసులతో కౌలు రైతుల్లో ఆందోళన నెలకొందని రైతు సంఘ రాష్ట్ర నాయకుడు చెల్లుబోయిన కేశవశెట్టి, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి దేవ రాజేంద్రప్రసాద్ అన్నారు. గురువారం గొందిలో కౌలురైతు సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లి బుజ్జిబాబు అధ్యక్షతన కౌలురైతుల సంఘ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శిస్తులను నిర్ణయించే ఫెయిర్ రెంట్ కమిటీ, కౌలు రైతులతో చర్చించకుండా ఏకపక్షంగా నోటీసులు ఇవ్వడం సరికాదన్నారు. దేవస్థానం భూముల్లో పలు కారణాల రీత్యా పంటలు పండించలేని స్థితిలో ఉన్నప్పటికీ దేవస్థానానికి కౌలు రైతులు శిస్తులు చెల్లిస్తున్నారన్నారు. సమావేశంలో దొండపాటి చిట్టిరాజు, గేదెల తిరుపతి, దొండపాటి చంద్రమోహన్, నల్లి జాన్‌మోసే, కడలి సువర్ణరాజు, చొప్పల బెన్ని పాల్గొన్నారు.

అభాగ్యులను ఆదుకోవడంలో ముందంజ



పిండిమిల్లు వ్యాపారం నిమిత్తం యంత్ర సామగ్రిని అందజేస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు

కాజులూరు: అభాగ్యులను ఆదుకోవడంలో హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ముందంజలో ఉంటుందని సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు ఎ.శ్రావణి అన్నారు. ఆర్యావటానికి చెందిన నడికట్ల మధుబాబు, ఆయన తండ్రి నడికట్ల శ్రీనివాసు నరాల బలహీనత వ్యాధికి గురై కొన్నాళ్లుగా మంచానికే పరిమితమయ్యారు. ఈ విషయం తెలుసుకున్న సంస్థ సభ్యులు హైదరాబాద్‌కు చెందిన సీఎంకే చారిటబుల్ ట్రస్టు చైర్మన్ గుత్తుల మీరాకుమార్‌ను సంప్రదించగా, ఆయన రూ.25 వేలు అందజేశారు. హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు మరో రూ.15 వేలు సమకూర్చారు. వీటితో బాధిత కుటుంబ సభ్యులకు గ్రైండర్, ఇతర యంత్ర సామగ్రిని తాడి భార్గవిరెడ్డి చేతుల మీదుగా అందించారు. దీనితో బాధితుల ఇంటి వద్దే పిండిమిల్లు వ్యాపారం పెట్టించారు. సంస్థ సభ్యులు రమాదేవి, సుష్మ, వీరభద్రరావు, రామతులసి, ఉదయ్, కేవీవీ లక్ష్మి, ప్రకాష్ పాల్గొన్నారు.

ఇసుక సరఫరాలో అక్రమాలకు తావివ్వొద్దు



కొత్తపేటలో ఇసుక స్టాక్ పాయింట్ వద్ద అధికారులతో సమీక్షిస్తున్న జేసీ నిశాంతి

కొత్తపేట: ఇసుక సరఫరాలో ఏవిధమైన అక్రమాలకు తావులేకుండా చూడాలని జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి అధికారులకు సూచించారు. గురువారం స్థానిక ఇసుక స్టాక్ పాయింట్‌ను ఆమె తనిఖీ చేశారు. నియోజకవర్గంలో ఇసుక స్టాక్ పాయింట్లను స్వాధీనం చేసుకున్నప్పుడు నిల్వలు, అప్పటి నుంచి ఇప్పటి వరకూ ఇసుక సరఫరా, ప్రస్తుతం ఉన్న నిల్వలు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులు తనిఖీ చేశారు. స్టాక్ పాయింట్‌లో సిబ్బందికి పలు సూచనలు చేశారు. ముందుగా డివిజన్ రెవెన్యూ కార్యాలయంలో అధికారులతో రెవెన్యూ రికార్డుల భద్రత తదితర అంశాలపై సమీక్షించారు. కార్యక్రమాల్లో ఆర్డీఓ జీవీవీ సత్యనారాయణ, తహసీల్దార్ ఎలీషా, ఎంఆర్ఐ కొప్పిశెట్టి ఏడుకొండలు పాల్గొన్నారు.

పుట్టమట్టితో శివలింగాల తయారీ



శివలింగాలను ప్రదర్శిస్తున్న వాసవీ వనితా క్లబ్ సభ్యులు

రాజోలు: పుట్టమట్టితో పది వేల శివలింగాలను వాసవీ వనితా క్లబ్, విశ్వహిందూ పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో తయారు చేశారు. వీటిని స్థానికంగా గురువారం ప్రదర్శించారు. కోటి పార్థీవ శివలింగాలు తయారు చేయాలని సంకల్పించిన అమెరికా వాసి కోడెల శివప్రసాద్ మిత్ర బృందం అన్ని గ్రామాలకు పుట్టమట్టితోపాటు, శివలింగం తయారు చేసే మౌల్స్‌ను పంపించారని ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు కాసు శ్రీనివాస్ తెలిపారు. ఇందులో భాగంగా 10 రోజుల నుంచి మహిళలు 10 వేల శివలింగాలు తయారు చేశారన్నారు. సంఘ ఉపాధ్యక్షుడు రాజా నాగరత్నకుమార్, కాసు భవాని, చలువాది లక్ష్మి, కాసు సతీష్, దిలీప్, నాగరత్నం, సుధ, సత్యవతి, శిరం నాగమణి పాల్గొన్నారు.

వసతి గృహంలో ఆకస్మిక తనిఖీ



కాట్రేనికోనలో బీసీ వసతి గృహాన్ని తనిఖీ చేస్తున్న సంక్షేమ శాఖ ఇన్‌చార్జి డీడీ జ్యోతిలక్ష్మి

కాట్రేనికోన: స్థానిక బీసీ సంక్షేమ వసతి గృహాన్ని జిల్లా సంక్షేమ శాఖ అధికారి, బీసీ సంక్షేమ శాఖ ఇన్‌చార్జి డీడీ జ్యోతి లక్ష్మి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. వసతి గృహాల్లో కనీస వసతులు లేక విద్యార్థులు పడుతున్న ఇబ్బందులపై హాస్టల్‌కు రాం.. రాం.. శీర్షికన 'సాక్షి' దినపత్రికలో ఈ నెల 15న ప్రచురితమైన కథనంపై డీడీ స్పందించారు. నాణ్యత లేని భోజనం, అపరిశుభ్రతతో ఉన్న మరుగుదొడ్లు, రక్షిత మంచి నీరు లేకపోవడం, ఫ్యాన్లు లేకపోవడం, కిటికీలకు తలుపులు లేకపోవడం తదితర ఇబ్బందుల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్‌లో 11 మంది విద్యార్థులు మాత్రమే ఉండటంతో అడ్మిషన్లు ఎందుకు చేయలేదని వార్డెన్‌ను ప్రశ్నించారు. వసతి గృహంలో కనీస వసతులు కల్పించేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

గ్రామాల అభివృద్ధికి సీఎస్ఆర్ నిధులు

కలెక్టర్ మహేష్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం రూరల్: అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న చమురు సహజ వాయుల సంస్థలు కార్పొరేట్ సామాజిక బాధ్యతతో గ్రామాల అభివృద్ధికి సహాయం అందించాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ కోరారు. గురువారం కలెక్టర్ చాంబర్‌లో చమురు సహజ వాయువులు సంస్థ తూర్పు ప్రాంత ఆఫ్ షోర్ ఎసెట్ కాకినాడ ప్రతినిధులు, జిల్లా పంచాయతీ అధికారి, సీపీవోలతో సమావేశం నిర్వహించారు. ఓడల రేవు తదితర ప్రాంతాలలో మూడు క్లస్టర్ల ద్వారా నిర్వహిస్తున్న కార్యకలాపాలను ఓఎన్జీసీ ప్రతినిధులు కలెక్టర్‌కు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా ఓఎన్జీసీ అధికారులు ముడిచమురు, గ్యాస్, నీటి విభజన విధానం, పైప్‌లైన్ భద్రత, గోదావరి బేసిన్‌లో చమురు సహజ వాయువులు డ్రిల్లింగ్ ద్వారా వెలికితీత, డ్రిల్లింగ్ సమయంలో చేపల వేట కోల్పోయిన మత్స్య కారులకు జీవనభృతి అందించడం, కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధులు కేటాయింపు తదితర అంశాలను విశదీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 30వ తేదీ ఉదయం 10 గంటలకు చమురు, సహజవాయుల సంస్థ కార్యకలాపాలపై జిల్లా కాలుష్య నియంత్రణ మండలి, జిల్లా పంచాయతీ అధికారి, ఓఎన్జీసీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి సీఎస్ఆర్ నిధుల కేటాయింపుపై క్షుణ్ణంగా చర్చిస్తామని తెలిపారు. ఓఎన్జీసీ ఎస్టేట్ మేనేజరు కార్యనిర్వాహక సంచాలకులు రత్నేష్‌కుమార్, సీజీఎం మెకానికల్ నిర్మల్‌కుమార్, హెడ్ హెచ్‌ఎస్‌ఈ మేనేజర్ భాస్కరరావు, హెచ్‌ఆర్ హెడ్ సునీల్‌కుమార్, ప్రొడక్షన్ జనరల్ మేనేజర్ ఏ గుప్తా పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

రాయవరం: మండలంలోని చెల్లూరు సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుంది. ఈ విషయాన్ని రామచంద్రపురం ఏపీఈపీడీపీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వై.విజయానంద్ గురువారం విలేకరులకు తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మెయింటెనెన్స్ నిమిత్తం ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కారణంగా చెల్లూరు, చెల్లూరు శివారు చింతలతోట, మాచవరం, పసలపూడి రోడ్డు, వెంటూరు గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

పి.గన్నవరం: శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు అన్నారు. గురువారం పి.గన్నవరం పోలీస్ స్టేషన్‌ను ఆయన పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయిపై ఉక్కుపాదం మోపుతామన్నారు. తొలుత ఎస్పీ కృష్ణారావుకు ఎస్సై బి.శివకృష్ణ పూల మొక్క అందించి స్వాగతం పలికారు.

దరఖాస్తుల ఆహ్వానం

యానాం: యానాం నవోదయ విద్యాలయలో 6వ తరగతిలో ప్రవేశానికి వచ్చే ఏడాది జనవరి 18వ తేదీన నిర్వహించే ఎంట్రన్స్ టెస్ట్‌కు ఆసక్తి గల విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రాజశేఖర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. యానాంలో ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులన్నారు. అభ్యర్థుల తల్లిదండ్రులు యానాం నివాసితులై ఉండాలన్నారు. ప్రవేశ పరీక్షలో వచ్చిన మెరిట్ ప్రాతిపదికన ఎంపిక ఉంటుందని, దరఖాస్తుల స్వీకరణకు సెప్టెంబర్ 16ను ఆఖరు తేదీగా నిర్ణయించామన్నారు.

రక్షణ కవచం హెల్మెట్



రాజోలు కోర్టు కాంప్లెక్స్ వద్ద ర్యాలీలో పాల్గొన్న న్యాయమూర్తులు

రాజోలు: వాహనదారులకు హెల్మెట్ రక్షణ కవచం లాంటిదని సీనియర్ సివిల్ జడ్జి ప్రమీలారాణి, జూనియర్ సివిల్ జడ్జి హిమబిందు అన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం రాజోలు కోర్టు కాంప్లెక్స్ నుంచి హెల్మెట్ ధరించాలని నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనేక మంది మోటార్ సైకిల్ నడుపుతూ ప్రమాదానికి గురై తలకు చిన్నపాటి దెబ్బ తగిలి ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. అటువంటి సమయాల్లో హెల్మెట్ ప్రాణ రక్షణగా ఉపయోగపడుతుందన్నారు. రాజోలు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మామిడిశెట్టి సాయిబాబు, ప్రధాన కార్యదర్శి గొల్లమందల స్టాలిన్, సీనియర్ న్యాయవాదులు ఆకుల భాస్కరరావు, కోట సుధాకర్, కొక్కిరగెడ్డ శేషగిరిరావు, యేపుగంటి ఏడుకొండలు, జేహెచ్‌ఎస్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

శాకంబరిగా సుబ్బాలమ్మ

అమలాపురం టౌన్: పట్టణ దేవత సుబ్బాలమ్మ ఆలయంలో అమ్మవారు శాకంబరీదేవిగా గురువారం భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక గణపతి కూరగాయల వర్తక సంఘం సమకూర్చిన వివిధ రకాల కూరగాయలతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా కూరగాయల వర్తక సంఘం సభ్యులు అమ్మవారికి పానకం, చలివిడి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం గరగ నృత్యాలు, డప్పులు, వాయిద్యాలతో అమ్మవారిని ఊరేగించారు.